(సీరియల్ కథ)

# సుడిగాలిలో...... దీపం!



* రచన: శ్రీ బుద్ధిరాజు నరసింహారావు *

(గత సంచిక తరువాయి)

ఆమె అవస్థ చూసి అత్తగారు అడిగింది కూడా,

"ఏం అమ్మాయి... ఒంట్లో బాగు లేదా?"

"అబ్బే... అలాగేం లేదండి... ఎందుకో ఈ రోజు నా చెల్లెలు పుష్ప గుర్తుకొస్తోంది" దీప మాట మారుస్తూ అంది. అత్తగారు ఎక్కడ తన భావాలను పసి కట్టేస్తుందా అన్నట్లు త్వర త్వరగా వంటింటిలోకి వెళ్ళిపోయింది.

ఆమె వంటింటిలోకి వెళ్ళిపోయాక అక్కడే కూర్చుని పేపరు చదువుకుంటున్న రంగనాథం, భార్యతో అన్నాడు. "పాపం కోడలికి వొంట్లో బాగు లేనట్లుంది, ముఖం కూడ చూడు ఎలా పాలిపోయి వుందో? పోనీ రెస్టు తీసుకోమని చెప్పకూడదా?"

"అలాగే లెండి అన్నట్లు మీరు ప్రొద్దు ప్రొద్దున్నే కమలాన్ని విజయనగరం ఎందుకు పంపారు?"

"నీకు చెప్పేను కదే విజయనగరంలో మన బంగళా వాడు ఆరు నెలల బట్టి అద్దె ఇవ్వక తికమకలు పెడుతున్నాడు. ఆ విషయం గురించే వకీలు నోటీసు ఇచ్చి ఆ వ్యవహార మేమిటో తేల్చుకు రమ్మన్నాను. నేనే వెల్దును కానీ నాకీ ఉబ్బస జబ్బు ఈ వెధవ జబ్బు నన్ను ఊపిరి తీసుకోనిస్తేనా?"

"అయితే సాయంత్రానికి తిరిగి వస్తాడా?"

"అదెలా అవుతుందే సునాబేడా నుండి తెల్లారు ఝాము నాలుగు గంటలకి బయల్దేరే మొదటి బస్సు కొండ ప్రదేశమంతా దాటుకుంటూ విజయనగరం చేరే సరికి తొమ్మిదిన్నర, పదవుతుంది. అక్కడ వాడా పనంతా చూసుకునే సరికి సాయంత్రమై పోతుంది. వీలైతే లాస్టు బస్సులో తిరిగి రమ్మని చెప్పేనులే... వెళ్ళు... పాపం కోడలి సంగతి కాస్త చూడు."

"అలాగేనండి... అమ్మాయిని రెస్టు తీసుకో మంటాను" అంటూ పూర్ణమ్మ వంటింటి వైపు అడుగు లేసింది.

* * *

అకస్మాత్తుగా దీప ఉలిక్కిపడింది. ఎవరిదో పిలుపు వినిపించింది "దీపగారూ!"

అప్పటివరకూ దీప చుట్టూ అలముకున్న గత చరిత్ర చిత్రాలు చిన్నాభిన్నమైనాయి.

ఆమె తనను నిగ్రహించుకుంది. ఎదురుగా ప్రిన్సిపాల్ జగన్నాథరావు నిలబడి వున్నాడు.

"ఐసీ... నా అనుమానం నిజమన్నమాట... మీరీ రోజు ఏపనీ చేయలేరని ముందుగానే అనుకున్నాను".

"స...ర్..."

"ఇదిగో...శాస్త్ర వాచీని చూడండి ... ఇప్పుడు మధ్యాహ్నం మూడున్నర దాటింది. మీరలాగే కూర్చున్నారు".

"హుం...సారీ...సార్...నేను...నేను..."

"చూడండీ...మీరెంత చెప్పినా లాభంలేదు, జగన్నాథరావు చిరునవ్వు నవ్వుతూ నాకు రజనీకాంత్ అంతా విపులంగా చెప్పాడు. నేను కూడా మీకో సలహా యివ్వాలనుకుంటున్నాను. నన్ను తప్పుగా అర్థం చేసుకోకండి నేను వయసులో మీ తండ్రిలాంటి వాడిని దీపగారూ...జీవితం అన్నప్పుడు జీవించాలి, చిరునవ్వు నవ్వుతూ జీవించేదే జీవితం, ప్రతి వ్యక్తి జీవితంలో ఎన్నో కష్టాలు, ప్రతిక్షణం వేధించే అంతులేని సమస్యలూ వుంటాయి. అలాంటప్పుడు ఆ బాధలను మరచిపోయి ప్రశాంతంగా కాలం గడపడం తప్ప మనమేమీ చేయలేము. రజనీకాంత్ ఉత్తముడు. అభివృద్ధిలోకి వచ్చే యువకుడు. అందుకే గతాన్ని తలచుకుని బాధ పడే కంటే మీరు అతణ్ణి అంగీకరిస్తేనే మంచిది".

"సారీసర్...నేనలా చేయలేను. అదంత సులువైన పనికాదు...నా గత జీవితంలో ఎటువంటి సంఘటనలు జరిగాయో మీకు తెలియదు..."

"నాకంతా తెలుసు...అందుకే అంటున్నాను. మీరలా బాధపడినా ప్రయోజనమేమిటి?"

జగన్నాథరావు సానుభూతి పూరితమైన వాక్యాలకి దీప స్వరం బాధగా మూలిగింది, "మీకు తెలియదు సర్...నాపై దుష్ట గ్రహాల ప్రభావంవుంది. నేనో అభాగ్యురాలిని...బాబా భోలే సాధుడి వాక్యాలు అసత్యం కాలేదు..."

జగన్నాథరావు కొంత గంభీరమైన స్వరంలో అన్నాడు, "చూడండి దీప గారూ...నేను వయసు మళ్ళినవాడిని...నా జీవితంలో ఎన్నో అనుభవాలు గూడు కట్టుకుపోయాయి...ఈ బాబాజీల ఎన్నో కపట నాటకాలు నే నెరుగుదును. మీకు తెలియదు. మడి, ఆచారాలూ, మూఢనమ్మకాలు మా తల్లిదండ్రుల వద్ద మేము నేర్చుకున్నాము. చిన్న తనంలో మా తల్లి తండ్రి వారు ఆరాధించే బాబాజీల వద్ద మమ్మల్ని శిష్యులుగా చేర్చారు. నా కప్పుడు వారంటే ఎంతో నమ్మకముండేది. మీరు నమ్మలేరేమో గాని నేను వారికి వండి పెట్టి, వాళ్ళ ఎంగిళ్ళెత్తి, ఎంగిలిగిన్నెలూ కంచాలు కడిగి రోజల్లా వారి కాళ్ళు పట్టేవాడిని అప్పుడు సాధువు అంటే, బాబాజీ అంటే నాకంత గుడ్డినమ్మకముండేది. కాని ఓరోజు వారి నిజం బయట పడింది, వారు నిజంగా



Trade Mark Regd No. 306682

మా వద్ద...

"టర్కీస్ డాక్టర్"

- ఫైన్ జెట్టి.
- పోలింగ్ అయిలెట్.
- ఇంటర్‌లాక్.
- ఫేన్సీరకాలు.

రీసైజు, అన్ని విధములైన బనియన్లు, అన్ని రకాలలోనూ దొరకును.

★

ఆర్డర్లను వెంటనే గమనించి పంపబడును.

**Turkey Knittings**

**D-94 (I), Lakshmi Nagar**

**TIRUPUR-638 602**

బాబాజీలూ, సాధువులు కారని తెలిసి ఎంత బాధ పడ్డానో ఆ భగవానుడికే తెలుసు. వారు తన జీవితాలు సుఖ సంతోషాలతో నింపుకోడాని కలా మన మూఢ నమ్మకాలని, అంధ విశ్వాసాలనీ ఆధారంగా తీసుకుని మనల్ని మోసం చేస్తున్నారు. అసలీకాలంలో పూర్వం వంటి గొప్ప సాధువులూ మహాత్ములున్నా రంటే నమ్మకం కుదరదు.

"కాని సర్... అందరూ అలాంటి వారే అని ఎందుకను కోవాలి? బాబాజీ అన్న మాటలను వ్యతిరేకించినందుకు నేని రోజాని ఎంతగా నష్ట పోయానో ఎంత మనోవేదనకు గురయ్యానో చెప్పలేను".

"దీపగారూ...ఏం జీవితంలో ఆకస్మికంగా దుర్ఘటనలు జరగవా? అలాగే మీకు జరిగిన సంఘటన కూడా ఆకస్మిక మనెందుకనుకో కూడదు? కొన్ని ఆకస్మిక సంయోగాల వల్ల, సంఘటనలవల్ల బాబాజీలన్న మాటలలో యథార్థముందను కోవడం పొరపాటు!"

జగన్నాథరావు మాటలకు ఏమని ఎదురు చెప్పాలో దీప కర్థం కాలేదు. అందుకే తలదించుకుని మౌనంగా వూరుకుంది

చివరికి ఆమె మనోవేదనని అర్థం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ జగన్నాథరావు విషయం మారుస్తూ "అది సరే లెండి మీరిక వెళ్ళి రెస్టు తీసుకోండి...నా వల్ల ఎటువంటి సహాయం కావలసి వస్తే నాకు తప్పక తెలపగలరు"

"థాంక్స్ సర్!"

దీప రూం నుండి బయటకు వచ్చి చుట్టూ చూసింది. ఎదురుగా వున్న క్లాస్‌లో రజనీకాంత్ పాఠాలు చెప్తున్నాడు.

ఆమె అతన్నో సారి చూసి త్వర త్వరగా స్కూలు ఆవరణ దాటి బయట కొచ్చేసింది. ఇంటికి చేరుకుని తలుపువేసి భారంగా పరుపుపైపడి గత చరిత్ర చిత్రాలలో లీనమైపోయింది.

♦ ♦ ♦

ఉదయం తొమ్మిది గంటలై వుంటుంది.

కమల్ తెల్లారు ఝాము నాలుగు గంటలకి బయల్దేరే బస్సులో విజయనగరం వెళ్ళిపోయాడు.

పిచ్చి పిచ్చి ఆలోచనలతో సతమత మౌతున్న దీప వంటింటిలో పని చేసుకుంటోంది.

అప్పుడే అక్కడికి వచ్చిన పూర్ణమ్మ, "అమ్మాయి ఇక చాల్లే...నీ ఒంట్లో బాగులేనట్లుంది... వెళ్ళి రెస్టు తీసుకో మిలిగిన పని నేను చూసుకుంటానులే".

"పర్వాలేద త్తయ్యగారూ... పప్పూ కూరా అయిపోయింది అన్నం వార్చి చారుపడేస్తే పని పూర్తవుతుంది. నేను చేసేస్తాను లెండి".

"పర్వాలేదు నువ్వు వెళ్ళు నేను చూస్తాను"

పూర్ణమ్మ వాక్యం పూర్తి కాకుండానే బయట గొళ్ళెం శబ్దమయింది. ఎవరో బిగ్గరగా, "రంగనాథం గారూ రంగనాథం గారూ" అని పిలిచారు.

ఆ స్వరం ఎంతో గాబరాగా వుంది.

పూర్ణమ్మా దీపా వులిక్కి పడ్డారు.

అప్పుడే బాత్ రూంలోంచి స్నానంచేసి బయటకు వచ్చిన రంగనాథం నడుంకి లుంగీ చుట్టుకుంటూ బయట కెళ్ళాడు "ఎవరది?"

"నేనండి...రామారావుని..."

"ఓహో...రండి రండి...!"

రామారావు హడావిడిగా, "కొంప మునిగి పోయిందండీ.. మీ అబ్బాయి కూడా విజయనగరం వెళ్ళాడు కదూ?" అన్నాడు.

అప్పుడే పూర్ణమ్మకూడా బయటకు వచ్చింది. దీప ఆత్రుతగా ద్వారబంధం వెనక నిలబడింది. ఏదో అంతులేని భయం ఆమె హృదయాన్ని సుడిగుండంలా చుట్టేస్తోంది. బాబాజీ అన్నమాటలు చెవిలో గింగురుమన్నాయి. చేతులూ కాళ్ళూ వణక సాగాయి.

"అవును. కమల్ కూడా ప్రొద్దున్న బస్సులో వెళ్ళాడు. ఇంతకీ ఏం జరిగిందండీ! ఎందుకలా గాభరా పడుతున్నారు?" రంగనాథంకూడా ఆందోళన చెందుతూ అడిగాడు.

"సర్వనాశనమై పోయిందండీ సర్వనాశనం. నా కొడుకు ప్రసాదుకూడా ఆ బస్సులోనే విజయనగరం వెళ్ళాడు. ఇప్పుడే ఆ బస్సు కొండమీంచి బ్రేకు ఫేలయి క్రింద పడిందని అగ్ని ప్రమాదం జరిగి పోయిందని తెలిసింది. ఆ బస్సులోవున్న జనమంతా చనిపోయా

రుట." రామారావు ఏడుపాపుకో లేక పోయాడు.

"ఏమిటయ్యా నీ పిచ్చివాగుడు ... నీ కేమయినా మతి పోయిందా?" రంగనాథం పిచ్చెత్తిన వాడిలా అరిచాడు.

పూర్ణమ్మకు నిజంగా మతి పోయినట్లుయింది, "రామ రామ అయ్యో ... నా బాబు ... ఏమండీ నా బాబండీ"

దీపపై పిడుగుపడింది. పాదాల క్రింద భూమి గుండ్రంగా తిరిగినట్లయింది.

అంతే అలాగే నేల కూలిపోయింది.

హరేకృష్ణ ట్రాన్స్‌పోర్ట్ బస్సు బ్రేక్స్ ఫేలయి కొండత్రోవ నుండి తప్పి వందడుగుల క్రిందకు పడింది. క్రిందపడగానే బస్సుని మంటలు చుట్టేసాయి.

ఈ దుర్ఘటనని ఎదురుగా వస్తున్న ఓ టాక్సీ డ్రైవరు చూసి వెంటనే సాలూర్ పోలీసుస్టేషన్‌లో ఆ వార్త తెలిపాడు.

వార్త తెలియగానే వెంటనే పోలీసు సిబ్బందితో పాటు ఫాయర్ బ్రిగేడు వారుకూడా ఆ ప్రదేశాన్ని చేరుకున్నారు.

బాగా వెలుతురు వచ్చేలోగా అప్పటికింకా కాలని శవాలను బయటకు తీసారు. డ్రైవరు, కండక్టరుతోపాటు బస్సులో జనమంతా కాలిపోయి మసయి పోయినట్లున్నారు. ఆ వాతావరణం ఎంతో భయకంరంగా, వీభత్సంగావుంది.

ఆ దుర్ఘటన వల్ల దెబ్బతిన్న పరివారాలలో ఆ వార్త పిడుగులా పడింది. ఆర్తనాదాలూ హృదయం ముక్కలయ్యేలా కన్నీరూ!

రంగనాథం గారింటిలో కూడా అలాటి దృశ్యమే ఏర్పడింది, కాని ఆయన భార్య పూర్ణమ్మ కమల్ అలా మరణించడానికి కారణం దీపని తిట్టిపోస్తూ "ఆ రోజు విన్నా నమ్మలేదు నువ్వు నిజంగా దెయ్యానివే రాక్షసివి రక్తపిపాసివి నువ్వు పుట్టగానే తల్లి నిండుప్రాణాన్ని మింగేసావు బాబా భోలేనాథ్ ముందే నాకు నీ గురించి చెప్పి ఈ సంబంధం చేసుకో వద్దన్నాడు. కానీ ఈ ఇంట్లో నా మాట పట్టించుకునే దెవరు ఇక సంతోషించండి నా బాబు పోయాడుగా అయ్యో నా బాబు పండు లాంటి బాబు" పెద్దగా ఏడ్చింది పూర్ణమ్మ.

దీప తల దించుకుంది. కళ్ళల్లో నిండి వున్న కన్నీరు ఆ కన్నీటి అంతం లేనట్లు చుక్కలు చుక్కలుగా ఆమె పాదాలపై పడుతున్నాయి.

రంగనాథం హృదయం కూడా గాయపడింది. అకస్మాత్తుగా కొడుకుపోయాడన్న వార్తతో ఆయన విచలితుడైనాడు, కాని కొడుకు మరణానికి కారణం కోడలని దుష్టగ్రహాల ప్రభావమని ఒప్పుకోడానికి మనసంగీకరించడం లేదు. అందుకే భార్యని ఓదారుస్తూ, "ఊరుకోవే పాపం అభం శుభం ఎరుగని కోడలినెందుకలా తిట్టిపోస్తావు అంతా మన ఖర్మ అయిపోయిందేదో అయిపోయింది. కోడలికి మాత్రం మనకన్నా తక్కువ ఆవేదనుందా ఆమెని వాక్యబాణాలతో ఛేదించడం తప్పు పూర్ణం" అన్నాడు.

"తప్పా! ఏమిటండీ మీరనేది! ఈ పాపిష్టిదాన్ని ఏమన్నా పాపంలేదు. నేను ఇక దీని ముఖం చూడలేను. పూర్ణమ్మ ఆవేశంగా అరిచింది" అలా నిలబడి నా మొహం చూస్తావేమే ఫో బయటికి ఎందుకే నీ పాపిష్టి బ్రతుకు పోయి ఏ ఏట్లో నైనా దూకు వెళ్ళు ..."

"అ... త్త... గా... రూ..." దీప బావురుమంది.

"మర్యాదగా వెళ్ళేవా లేదా?"

"పూర్ణం ఏమిటా మాటలు ... నా ..." రంగనాథం ఏదో అనబోయాడు.

"నేనేమీ వినేది లేదు ... తక్షణం ఈ ఇంట్లో నుండి వెళ్ళిందా సరేసరి లేదా నేనేపోయి బావిలో దూకుతాను బొంగురు గొంతుకతో పూర్ణమ్మ అరిచింది.

"అంత మాట నకండి అత్తయ్యగారూ అవును ఈ రోజిలా జరడానికి కారణం నేనే నేనో దౌర్భాగ్యురాలిని మీ మాట కాదనను" వెక్కి వెక్కి ఏడుస్తూ దీప అత్తగారి పాదాలను తాకబోయింది, కాని పూర్ణమ్మ వెనక్కి జరిగింది అసహ్యంచుకుంటూ.

దీప జీవం లేనట్టు లేచి మామగారి పాదాలపై వొంగబోయింది.

రంగనాథం కళ్ళు చెమ్మగిల్లాయి, ఆయన ఆమెను లేవనెత్తాడు "అమ్మా"

ఆయనేదో అనబోయాడు కాని భార్య రూపం చూసి మాట మారుస్తూ "రామ్మా - నిన్ను రైల్వేస్టేషను దాకా దిగబెడతాను".

(సశేషం)